క్లుప్తంగా

సాయిబాబా ఆలయంలో విశేష పూజలు



భీమవరంలో హౌసింగ్ బోర్డ్ కాలనీలో సాయిబాబాకు క్షీరాభిషేకం

సాక్షి, భీమవరం: భీమవరం హౌసింగ్ బోర్డ్ కాలనీలోని వెంకట సాయిబాబా ఆలయ 12వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం బాబాకు మెంటే పార్థసారథి, వసంత విజయ లక్ష్మి దంపతులు అష్టోత్తర కలశారాధన, కలశాభిషేకం, గోక్షీరాభిషేకం నిర్వహించారు. ఆలయ చైర్మన్ మల్లినీడి తిరుమలరావు (బాబి) ఆధ్వర్యంలో హోమాలు, ద్వాదశ జ్యోతిర్లింగార్చన చేశారు. తిరుమల సుధాకర్, కాకులపాటి భానుమూర్తి, సీతామహాలక్ష్మి, గంధం వెంకటేశ్వరరావు, ధనలక్ష్మి పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎంపిక



క్యాంపస్ సెలెక్షన్స్‌లో ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థినులు కేసన లక్ష్మీరాధ, తోరం శ్రీనాగ పద్మభవానిమనీషా క్యాంపస్ సెలెక్షన్స్‌లో రూ.6.52 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ ఎం జగపతిరాజు చెప్పారు. ఉద్యోగాలకు ఎంపికైన ఎంపికైన విద్యార్థులలను సెక్రటరీ కరస్పాండెంట్ సాగి రామకృష్ణని శాంత్‌వర్మ బుధవారం అభినందించారు. ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్స్ సెల్ డీన్ కేఆర్ సత్యనారాయణ, సివిల్ ఇంజనీరింగ్ హెడ్ ఏసీఎస్‌వీ ప్రసాద్ పాల్గొన్నారు.

ఊపందుకున్న దాళ్వా మాసూళ్లు



గొల్లవానితిప్పలో వరికోత యంత్రంతో కోత కోస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: వర్షం ప్రభావం తగ్గడంతో రెండు రోజులుగా ఎండ ప్రభావం పెరిగింది. దీంతో దాళ్వా మాసూళ్లు బుధవారం ఊపందుకున్నాయి. మండలంలో 8,887 ఎకరాల్లో దాళ్వా సాగుకు రైతులు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే యనమదుర్రు, దిరుసుమర్రు, గొల్లివానితిప్ప, కొమరాడ, రాయలం, వెంపలో సుమారు 3 వేల ఎకరాల్లో దాళ్వా మాసూళ్లు పూర్తయ్యాయి. వాతావరణం మార్పులతో అకాల వర్షాలు కురవడంతో రైతులు వరికోత యంత్రాలతో ధాన్యాన్ని ఒబ్బిడి చేసే పనిలో నిమగ్నమయ్యారు. వ్యవసాయాధికారులు మండలంలో 12 వ్యవసాయాధారిత గ్రామాల్లోని ఆర్‌బీకే సెంటర్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంతో రైతులు ఎప్పటికప్పుడు ధాన్యాన్ని విక్రయించేందుకు ఒబ్బిడి చేస్తున్నారు.

రోడ్డు విస్తరణ పనుల ప్రారంభం



చినకాపవరం నుంచి క్రొవ్విడి రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించిన దృశ్యం

ఆకివీడు: కేంద్ర రహదారుల నిధులతో నిర్మించనున్న కేజీ రహదారిలోని చినకాపవరం–క్రొవ్విడి రోడ్డు అభివృద్ధి పనులను బుధవారం ప్రారంభించారు. క్రొవ్విడి–కొల్లేరు పంట కాల్వకు చేర్చి ఉన్న మొక్కల్ని తొలగించి రిటరిన్నింగ్ వాల్ నిర్మాణం ప్రారంభించారు. రహదారి విస్తరణ, సీసీ రోడ్డు, రిటర్నింగ్ వాల్ నిర్మాణంతో కేజీ రహదారిలోని సమస్యలు తొలగనున్నాయని ఆ ప్రాంత ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల రోడ్డు నిర్మాణం కోసం రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ భూమి పూజ చేసిన విషయం విదితమే.

సచివాలయ ఫర్నీచర్ కోసం రూ. లక్ష విరాళం



సర్పంచ్ కోళ్ల బాలకృష్ణకు చెక్కు అందిస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: భీమవరం మండలంలోని దిరుసుమర్రులో నిర్మించిన సచివాలయంలో ఫర్నీచర్ ఏర్పాటు చేయుట నిమిత్తం బీవీ రాజు కళాశాల యాజమాన్యం రూ. లక్ష విరాళాన్ని సర్పంచ్ కోళ్ల బాలకృష్ణకు అందజేశారు. గ్రామాభివృద్ధికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని సర్పంచ్ కోళ్ల బాలకృష్ణ బీవీ రాజు యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

భీమవరాన్ని అన్ని హంగులతో తీర్చి దిద్దుతున్నాం

- నాడు, నేడు నా హయాంలోనే పట్టణాభివృద్ధి
- పట్టణాభివృద్ధికి అధిక నిధులు
- ప్రతిపక్షాలను ప్రశ్నించిన ఎమ్మెల్యే గ్రంధి



32వ వార్డులో సీసీ రోడ్డును ప్రారంభించి శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం పట్టణాన్ని నాడు, నేడు తాను మాత్రమే అభివృద్ధి చేశానని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. మీ హయంలో చేసిన అభివృద్ధికి సంబంధించి ఒక్క ల్యాండ్ మార్క్ చూపించాలని ప్రతిపక్షాలను ఆయన ప్రశ్నించారు. పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో బుధవారం ఆయన పాల్గొన్నారు. ముందుగా 32వ వార్డులో రూ.39.90 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, సీసీ డ్రైన్, కల్వర్టులను ఆయన ప్రారంభించారు. అనంతరం రూ.49.70 లక్షలతో నిర్మించనున్న 32వ వార్డులోని చెట్టు కింద సాయిబాబా గుడి వద్ద నుంచి రాయలం వంతెన వరకు సీసీ రోడ్డు, సీసీ డ్రైన్, కల్వర్టు పనులకు, 37వ వార్డులో రూ 32.60 లక్షలతో నిర్మించనున్న చెక్క వారి వీధిలో సీసీ రోడ్డు, సీసీ డ్రైన్, ఆర్‌సీసీ స్లాబ్ కల్వర్టు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసే దిశగా అధిక నిధులు కేటాయించి, పనిచేస్తున్నానని అన్నారు. అభివృద్ధి జరగలేదని ప్రతిపక్షాలు చెప్పడం హాస్యాస్పదమని అన్నారు. భీమవరాన్ని అన్ని హంగులతో తీర్చి దిద్దుతున్నామని ఆయన అన్నారు. కమిషనర్ ఎస్ శివరామకృష్ణ, రెండో పట్టణ జేసీఎస్ కన్వీనర్ గాదిరాజు సుబ్రహ్మణ్యం రాజు, కొల్లి ప్రసాద్, చెన్ను చంటి, పట్టణ కన్వీనర్ తోట భోగయ్య, మున్సిపల్ ఎం ఈ త్రినాథరావు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, రజక కార్పొరేషన్ డైరెక్టర్ రేవూరి గోగు రాజు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏఎస్ రాజు, కానుబోయిన వెంకటరమణ, వేంద్ర విజయదుర్గ, ముత్యాల బుజ్జి, ముల్లి నరసింహామూర్తి, బొర్రా వాసు, గంటా సుందర్ కుమార్, పాలపర్తి జోనా, చిన్నమిల్లి వెంకటరాయుడు, మానేపల్లి నాగేశ్వర రావు, తాళ్లపూడి పరమేశ్వరరావు, బాలజ్యోతి మూర్తి, కృష్ణంరాజు, మండలి నరేంద్ర, గన్నాబత్తుల పూర్ణ, భూపతి రాజేష్, నాడగల జోగారావు, జూలూరి పండు,చవ్వా హనుమంతరావు, అల్లూరి నరసింహారాజు, కైలా పాండు, పేరిచర్ల సత్యనారాయణ రాజు, తోట సాయిబాబా పాల్గొన్నారు.

28 నుంచి రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు



సమావేశంలో మాట్లాడుతున్న నిర్వాహకులు

కాళ్ల: డాక్టర్ దంతులూరి విజయరామరాజు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు రాష్ట్రస్థాయి ఇన్విటేషన్ వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించినట్లు నిర్వాహకులు ఇందుకూరి ప్రసాద్ రాజు పెనుమత్స విశ్వనాథరాజు తెలిపారు. కోపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్లో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సహించాలని ఆలోచనతో ప్రముఖ వైద్యులు దంతులూరు విజయరామరాజు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో రాష్ట్రంలోని ఆరు జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొంటారని అన్నారు. విజయనగరం, విశాఖ స్టీల్ ప్లాంట్, వెస్ట్ గోదావరి, ఎస్వీఆర్ ఫౌండేషన్, శ్రీకాకుళం కృష్ణ జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నానున్నట్లు వారు స్పష్టం చేశారు. క్రీడాకారులకు అలవెన్సులు, భోజన వసతులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రోత్సాహంగా ప్రథమ బహుమతి రూ.30 వేలు, ద్వితీయస్థానానికి రూ.25 వేలు, తృతీయ స్థానానికి రూ.20 వేలు అందిస్తామన్నారు. పోటీలు కాళ్ల మండలం కోపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్లో నిర్వహించినట్లు స్పష్టం చేశారు.30వ తేదీన ముగింపు రోజున విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తారని నిర్వాహకులు తెలిపారు. జిల్లా వాలీబాల్ కార్యదర్శి పవన్ కుమార్ వర్మ, నిర్వాహకులు, కమిటీ సభ్యులు పి. ప్రభాకర్ రాజు, డి.శివాజీ రాజు, జయవర్మ, మురళీకృష్ణ వర్మ, డి. శ్రీనివాస రాజు, మ్యాజిక్ బోసు, సీతారామరాజు, చంటి రాజు, బంగారు రాజు పాల్గొన్నారు.

శ్రీనివాస్‌కు ఆంధ్రరత్న పురస్కారం



భీమవరంలో ఆంధ్రరత్న పురస్కార గ్రహీత శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: సామాజిక సేవారంగంలో మత్స్యకారుల సమస్యలు, జీవన స్థితిగతులపై, అధ్యయనం, అవగాహన, సంఘ సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా కొల్లు శ్రీనివాస్‌కు అఖిల భారత తెలుగు సాంస్కృతిక సమాఖ్య ఆంధ్రరత్న పురస్కారాన్ని అందించడం అభినందనీయమని పలువురు అన్నారు. బుధవారం కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ భవనంలో కొల్లు శ్రీనివాస్‌ను సత్కరించిన సందర్భంగా అరసవల్లి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు అరసవల్లి సుబ్రమణ్యం, త్యాగరాజ భక్త సభ సభ్యుడు చెరుకువాడ వెంకట్రామయ్య, త్యాగరాజ మ్యూజిక్ అకాడమీ సభ్యుడు కారుమూరి చినబాబు మాట్లాడారు. శ్రీనివాస్ ఈనెల 24న హైదరాబాద్‌లోని శ్రీపొట్టి శ్రీరాముల తెలుగు యూనివర్సిటీలో అఖిల భారత తెలుగు సాంస్కృతిక సమాఖ్య ఆంధ్రరత్న అవార్డుతో సత్కరించిందన్నారు. శ్రీనివాస్ గతంలో వరల్డ్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ (ఢిల్లీ) భారత్ గౌరవ్ శ్రీసమ్మాన్ అవార్డును అందించిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో చుక్కనశ్రీ, కొండ్రు శ్రీనివాస్, నీలాతి పోతయ్య పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన రెవెన్యూ అధికారుల సంఘ నాయకులు



కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన రెవెన్యూ అధికారుల సంఘ నాయకులు

భీమవరం(ప్రకాశం చౌక్): ఇటీవల నూతనంగా ఎన్నికైన జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం కలెక్టర్ పి.ప్రశాంతిని బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్‌తో పాటు డీఆర్వో కృష్ణవేణి, ఏఓ దుర్గా కిషోర్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ప్రజలకు సేవలందించి మంచి పేరు తెచ్చుకోవాలని అధికారులు సూచించారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భూపతి రాజు రవీంద్ర రాజు, మిరియాల లక్ష్మీనారాయణ, అసోసియేట్ అధ్యక్షుడు గుమ్మడి జకరయ్య, జిల్లా ట్రెజరర్ గుర్రం చిట్టిబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు, ఏసుబాబు, శ్రీనివాసరావు, రాంబాబు, ఆకుల బాబు రాజేంద్ర ప్రసాద్, కొల్లాటి లక్ష్మి యార్లగడ్డ రాజు, ఇతర కార్యవర్గం పాల్గొన్నారు.


మే డే ఉత్సవాలకు ఏర్పాట్లు



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

కాళ్ల: మేడే వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని సీపీఎం మండల కార్యదర్శి గొర్ల రామకృష్ణ తెలిపారు. సీఐటీయూ కాళ్ల మండల కమిటీ సమావేశం మండల కేంద్రమైన కాళ్ల శివాలయంలో మండా సూరిబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి గొర్ల రామకృష్ణ మాట్లాడుతూ మేడే వారోత్సవాల ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలోని కార్మికుల నివసించే ప్రాంతాల్లో ఆటల పోటీలు నిర్వహించాలని గెలుపొందిన వారికి బహుమతులు ఇవ్వాలని స్పష్టం చేశారు. మే డే రోజు కాళ్ల మండల కేంద్రంలో పెద్ద ఎత్తున ప్రదర్శన సభ నిర్వహించాలని కార్మికులు ఉద్యోగులు రైతులు వ్యవసాయ కార్మికులు యావత్తు శ్రామిక వర్గం పెద్ద ఎత్తున పాల్గోవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి సీఐటీయూ మండల కమిటీ సభ్యులు దావులూరి మార్తమ్మ, ఝాన్సీ, గంటా భవాని, ఏడుకొండలు, బాతు రామస్వామి, తీరుమని శ్రీను, ఆంజనేయులు పాల్గొన్నారు.

చదరంగంలో ఉచిత శిక్షణ



చదరంగం ఉచిత శిక్షణ శిబిరం బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అనసూయ చెస్ అకాడమీ సహకారంతో వేసవి చదరంగం ఉచిత శిక్షణ శిబిరాలను భీమవరంలోని మూడు సెంటర్స్‌లో ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు మాదాసు కిషోర్ తెలిపారు. బుధవారం దీనికి సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించిన సందర్భంగా వివరాలను వెల్లడించారు. మే 1 నుంచి 10 రోజుల పాటు చెస్‌లో ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్టు వివరించారు. శిక్షణా శిబిరాలు వన్ టౌన్‌లోని అంకాల ఆర్ట్ అకాడమీ భవనం, టూ టౌన్‌లోని అనసూయ చెస్ అకాడమీ, త్రీ టౌన్‌లోని హౌసింగ్ బోర్డ్ కాలనీలోని శ్రీ ఆదిత్య కళావేదిక వద్ద శిక్షణ ఇస్తామన్నారు. పేర్ల నమోదు, ఇతర వివరాల కోసం సెల్ నంబర్ 90632 24466 సంప్రదించాలని కిషోర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అల్లు శ్రీనివాస్, మైలాపురి మురళి పాల్గొన్నారు.

అనువాదం ద్వారా ఉపాధి అవకాశాలు

సాక్షి, భీమవరం: ప్రపంచంలోని వివిధ భాషా ప్రాంతాల ప్రజల సంస్కృతీ, సంప్రదాయాలు, విజ్ఞాన విశేషాలు వంటివి వ్యాప్తిచేసి ఏకం చేసిన ప్రక్రియ అనువాదమని బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం తెలుగు ప్రొఫెసర్ బూదాటి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం భీమవరం ఆర్ఆర్ డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశా తెలుగు, ఆంగ్ల విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి అంతర్జాల సదస్సులో ఆయన పాల్గొని అనువాద సమస్యలు అనేక అంశంపై మాట్లాడారు. నాగార్జున యూనివర్సిటీ ఇంగ్లీషు ప్రొఫెసర్ ఎం సురేష్‌కుమార్ మాట్లాడుతూ అనువాదం ఒక వృత్తిగా పరిణామం చెందిందని అనువాదానికి సంబంధించి డిప్లొమా, ఎంఏ కోర్సులను చదవడం ద్వారా నిరుద్యోగ యువత ఉపాధి అవకాశాలను పొందవచ్చునన్నారు. సదస్సులో జోన్ టు ఆర్‌జేడీ పీవీ కృష్ణాజీ, కళాశాల ప్రిన్సిపాల్ వీకేజే ప్రసూన, వైస్ ప్రిన్సిపాల్ ఎస్ లక్ష్మీకాంతం, పి అరవిందస్వామి, కాకుమాని శ్రీనివాసరావు, పి రాజశేఖర్ పాల్గొన్నారు.

నవరత్నాలతో ప్రతి కుటుంబానికీ మేలు



భీమవరం 16 వార్డులో లబ్ధిదారులతో మాట్లాడుతున్న పార్టీ నాయకులు

భీమవరం(ప్రకాశం చౌక్): ప్రతి కుటుంబానికి మేలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుందని వైసీపీ పట్టణ కన్వీనర్ తోట భోగయ్య అన్నారు. బుధవారం పట్టణంలోని 16 వార్డులో వార్డు ఇన్‌చార్జ్ నందమూరి ఆంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తోట భోగయ్య, నందమూరి ఆంజనేయులు, పార్టీ నాయకులు ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులతో సంక్షేమ పథకాల అందుతున్న తీరుపై లబ్ధిదారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. జగనన్ననే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు గృహాలకు అతికించారు. ఈ సందర్భంగా తోట భోగయ్య, నందమూరి ఆంజనేయులు మాట్లాడుతూ ప్రతి కుటుంబంలోని ప్రతి ఒకరికీ మేలు జరిగే విధంగా సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందించారన్నారు. గత ప్రభుత్వ పాలనలో ప్రజలకు ఎటువంటి మేలు జరగలేదని, దీంతో ప్రజల దగ్గరకు ఆ పార్టీ నాయకులు వెళ్లే ధైర్యం చేయలేదని అన్నారు. ఇంటింటికీ నేడు వైఎస్సార్ సీపీ పాలనకు బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వన్‌టౌన్ జేసీఎస్ కన్వీనర్ నల్లం రాంబాబు, పార్టీ నాయకులు గంధం సీతారామ్, మాకిరెడ్డి వెంకటేశ్వరరావు, గుత్తుల భాస్కరరావు, పోలమేర ఉమహేశ్వరరావు, బోణం సురేష్‌కుమార్, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్హులందరికీ జగనన్న ఇళ్ల పట్టాలు



కుముదవల్లిలో బ్రోచర్లు అందించి పథకాలు వివరిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్

పాలకోడేరు: కుముదవల్లి గ్రామంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారంతో ముగిసింది. డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానిక వైసీపీ నాయకులు భూపతి రాజు వంశీకష్ణంరాజు, భూపతి రాజు రవి కుమార్ రాజు, అంగరాజు సత్తిబాబు, భూపతి రాజు జగన్నాథరాజు పాల్గొన్నారు. ఉత్సాహ భరిత వాతావరణంలో నాయకులు ఇంటింటికీ తిరిగి ప్రజలను కలిశారు. అనంతరం పీవీఎల్ మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలందరినీ కలిశామని, ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందుతున్నాయని తెలిపారని అన్నారు. జగనన్న ఇళ్ల పట్టాలు అర్హులందరికీ అందాయని, ఇప్పటికే 90 శాతం మంది నిర్మాణాలు ప్రారంభించారని అన్నారు. గ్రామంలో కొన్ని చోట్ల రోడ్లు, డ్రెయినేజీలు సమస్యలు చెప్పారని, జగనన్న ఇచ్చిన హామీ మేరకు గ్రామానికి రూ.20 లక్షలు మంజూరవుతాయని, గ్రామస్తులు సమష్టిగా నిర్ణయించి అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భూపతి రాజు చంటి రాజు, పార్టీ యువజన విభాగం మండల అధ్యక్షుడు పెన్మత్స వెంకటరాజు, సర్పంచి భూపతి రాజు వంశీకృష్ణంరాజు, భూపతిరాజు, రవికుమార్ రాజు, భూపతి రాజు జగన్నాథ రాజు, అంగరాజు సత్తిబాబు, సుబ్రహ్మణ్యం, మంచిన నరేష్, పిట్ల శ్రీనివాస్, తంగెళ్ల నరసింహ స్వామి, గుమ్మళ్ళ మోషే, తోట సంసోను, పీతల రవీంద్ర, వడ్డీ నవీన్, ఎంపీటీసీలు తోట ఆలిస్ మేరీ, షేక్ పాపా సాహెబ్, కే నాగలక్ష్మి, వైస్ ఎంపీపీ ఆదాడ లక్ష్మీ తులసి,గుండు నాగేశ్వరరావు, సర్పంచులు ఇంజేటి మరియమ్మ, చింతపల్లి వెంకటనారాయణ, కడలి సుబ్రహ్మణ్యం గడ్డం జోషి కొండపల్లి శ్రీనివాస్, పెన్మత్స రంగరాజు, కడలి శ్రీనివాస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డెక్కిన అపార్టుమెంట్ల మురుగు



దత్త క్షేత్రం వద్ద నిర్మిస్తున్న అపార్టుమెంట్లకు చెందిన వ్యర్థ నీరు



విజయ థియేటర్ వద్ద ఉన్న అపార్టుమెంట్ నుంచి వచ్చిన మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తున్న దృశ్యం

ఆకివీడు: నిబంధనలకు విరుద్ధంగా అపార్టుమెంట్లకు అనుమతులు ఇవ్వడంతో స్థానికులు అవస్థలకు గురవుతున్నారు. స్థానిక విజయ థియేటర్ వద్ద నిర్మించిన అపార్టుమెంట్‌లోని వ్యర్ధనీరు బయటకు పోయే మార్గం లేక జాతీయ రహదారిని ముంచెత్తుతోంది. కొన్నేళ్లుగా సమీపంలోని పెట్రోల్ బంకులోకి మురుగునీరు చొచ్చుకువెళ్లింది. ఇటీవల పెట్రోల్ బంకు ప్రాంగణాన్ని పూడ్చి ఎత్తు చేయడంతో అపార్టుమెంట్ వ్యర్థనీరు జాతీయ రహదారిని ముంచెత్తుతోంది. డ్రెయినేజీ సౌకర్యం లేక కొద్దిపాటి వర్షానికే ఈ ప్రాంతం జలమయమవుతోంది. ఇదే ప్రాంతంలో మరో నాలుగు అపార్టుమెంట్లు నిర్మిస్తున్నారు. పిల్లర్ల నిర్మాణం ద్వారా వచ్చే వ్యర్థ నీటిని సమీపంలోని కచ్చా డ్రెయిన్‌లోకి వదిలివేస్తున్నారు. అపార్టుమెంట్ల నిర్మాణం పూర్తయితే డ్రెయినేజీ సమస్య మరింత జఠిలమయ్యే అవకాశం ఉందని స్థానికులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు అపార్టుమెంట్‌లకు అనుమతులు ఇచ్చే సమయంలో నిబంధనలు పాటించడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు. అనుమతులు రాకుండానే కొన్నిచోట్ల భవనాలు నిర్మిస్తున్నారని, నిబంధనలకు మించి అంతస్తులు నిర్మిస్తున్నా నగర పంచాయతీ అధికారులు ఏ విధమైన చర్యలూ తీసుకోవడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు.

ఎస్వీబీటీ సమ్మర్ ఎక్స్‌ప్రెస్ ఏర్పాటుపై హర్షం



ఎస్వీబీటీ సమ్మర్ ఎక్స్‌ప్రెస్ ఏర్పాటుపై హర్షం వ్యక్తం చేస్తున్న దత్త క్షేత్ర కార్యదర్శి కంభంపాటి త్రినాథ కృష్ణమూర్తి

ఆకివీడు: నర్సాపురం–ఎస్వీబీటీ సమ్మర్ ఎక్స్‌ప్రెస్ రైలును ఏర్పాటు చేయడంపై స్థానిక దత్త క్షేత్ర కార్యదర్శి కంభంపాటి త్రినాథ కృష్ణమూర్తి హర్షం వ్యక్తంచేశారు. దత్త క్షేత్రంలో బుధవారం ఆయన మాట్లాడుతూ మైసూరు దత్తపీఠానికి వెళ్లేందుకు భక్తులకు తీవ్ర ఇబ్బంది ఏర్పడుతోందని, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లకు బెంగుళూరు వెళ్లాలన్నా తీవ్ర ఇబ్బంది కలుగుతోందని దత్తపీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామీజీ దృష్టికి తీసుకువెళ్లగా స్థానిక ప్రజాప్రతినిధుల అంగీకార పత్రాలతో రైల్వే శాఖఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లామన్నారు. దీంతో ఎస్వీబీటీ ఎక్స్‌ప్రెస్ రైలును సమ్మర్ సందర్భంగా ఏర్పాటు చేశారని చెప్పారు. ఈ నెల 28వ తేదీ మధ్యాహ్నం 3.50కి నర్సాపురం నుంచి రైలు బయలు దేరుతుందన్నారు. ప్రతి శుక్రవారం ఐదు వారాల పాటు ఈ రైలు నడుపుతారని చెప్పారు. ప్రయాణికుల రద్దీ ఆధారంగా రైలును శాశ్వతంగా నడిపే అవకాశం ఉందని కృష్ణమూర్తి చెప్పారు. ఉభయగోదావరి జిల్లాలకు చెందినవారు, కోనసీమ జిల్లా ప్రజలు రైలు సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైలు ఏర్పాటుకు సహకరించిన మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు, ఎంపీలు, ఎమ్మెల్యేలకు ఆయన ధన్యవాదాలు చెప్పారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సాక్షి, భీమవరం: పంచాయతీ కార్మికులపై వేధింపులను తక్షణం ఆపాలని పంచాయితీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. బుధవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో చింతా రాజారెడ్డి అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం జరిగింది. పంచాయతీ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఇంటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పంచాయతీ కార్మికులు పోరాడి సాధించుకున్న జీవోలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.సంఘం గౌరవ అధ్యక్షుడు ఎం ఆంజనేయులు మాట్లాడుతూ తక్షణమే కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మల్లుల ఏసుబాబు, రాజబాబు, శివ, కిరణ్, నాగార్జున, బాపనయ్య, శ్రీను పాల్గొన్నారు.

చిన్నారులకు ఉచిత గుండె వైద్య పరీక్షలు

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక సుందరయ్య భవనంలో వసుధ ఫౌండేషన్, అల్లూరి సీతారామరాజు భగత్ సింగ్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో 15 ఏళ్లలోపు వయస్సు ఉన్న పిల్లలకు ఉచిత గుండె పరీక్షలు నిర్వహించారు. విజయవాడకు చెందిన ఇంటర్ వెన్షనల్ చిల్డ్రన్ కార్డియాలజిస్ట్ విక్రమ్. కె. పిల్లలకు ఎకో పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందించారు. ఆపరేషన్ చేయాల్సిన చిన్నారులను గుర్తించారు. ఆపరేషన్ విజయవాడ ఆంధ్ర హాస్పిటల్‌లో చేస్తామన్నారు. వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు, అల్లూరి సీతారామరాజు భగత్ సింగ్ వైద్య సహాయ కేంద్రంనకు చెందిన వి.రాధాకృష్ణ పాల్గొన్నారు.

నేడు బ్యాంకు కాలనీలో ఉచిత వైద్య శిబిరం

సాక్షి, భీమవరం: భీమవరం పట్టణం సీనియర్ సిటిజన్స్ ఫోరమ్ ఫర్ బెటర్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 27న ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎన్‌వీకే నాగేశ్వరరావు, బోనం పాండురంగారావు బుధవారం తెలిపారు. సొసైటీ రజతోత్సవాల సందర్భంగా బ్యాంకు కాలనీలోని సుంకర బ్రహ్మయ్య విజ్ఞాన కేంద్రం కల్యాణ మండపంలో 60 ఏళ్లు పైబడిన వారికి ఉచిత కంటి పరీక్షలు, బీపీ, సుగర్ పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు.

నేడు నిప్పులగుండం ప్రవేశం

ఉండి: పోలేరమ్మ, మహంకాళమ్మ, వెంకమ్మ, పోతురాజు ఆలయ 60వ వార్షికోత్సవ మహోత్సవాల్లో భాగంగా 27వ తేదీ గురువారం రాత్రి 8 గంటలకు ఉండిలో నిప్పుల గుండం ప్రవేశం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్, మాజీ సర్పంచ్ చిక్కాల సత్యజగదీష్ ప్రసాద్ తెలిపారు.ఆసక్తి కలిగిన భక్తులంతా ఈ కార్యక్రమంలో పాల్గొని అమ్మవార్ల ఆశీస్సులు పొందాలని కోరారు.

పరిసరాల పరిశుభ్రతతో దోమల నివారణ

ఆకివీడు: మలేరియా వ్యాధిని అరికట్టేందుకు దోమల నివారణే ప్రధాన లక్ష్యమని ప్రిన్సిపాల్ కే.సుజాత చెప్పారు. మండలంలోని దుంపగడప వీవీ.గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మలేరియా దినోత్సవం సందర్భంగా బుధవారం విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతో కొంత వరకూ దోమల్ని నివారించవచ్చునన్నారు. కమ్యూనిటీ హెల్ అధికారిణి సీహెచ్. ఫ్లోరెన్స్ మాట్లాడుతూ మలేరియా రాకుండా అందరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.